

## మోస్తరు వానలు పడొచ్చు..

సిటీబ్యూరో, మే 15 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో రెండు రోజులుగా వానలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో గురువారం ఉదయం నగరంలోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. రాత్రి 7గంటల వరకు లంగర్‌హౌస్‌లో 3.0 సెం.మీలు, కార్వాన్‌లో 2.35 సెం.మీలు, ఆసిఫ్‌నగర్‌లోని అల్లబండలో 2.28 సెం.మీలు, కిషన్‌బాగ్‌లో 2.15 సెం.మీలు, పాతబస్తీ దూద్‌బౌలిలో 1.83 సెం.మీలు, జియాగూడ, షేక్‌పేట, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో 1.50 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. ఆవర్తనం, ద్రోణి ప్రభావం కొనసాగుతుండడంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 35.6, కనిష్ఠం 22.8 డిగ్రీలు, గాలిలో తేమ 43శాతంగా నమోదైనట్లు వివరించారు.


# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, శుక్రవారం 16 మే 2025 | HYDERABAD





# మెట్రో బాదుడు

## టికెట్‌పై 20 శాతం పెంపు

### రేపటి నుంచి అమల్లోకి..

సామాన్యుడికి భారమన్న అభిప్రాయం

సర్కారు పునరాలోచన చేయాలని విజ్ఞప్తి

చార్జీల పెంపును వ్యతిరేకించిన సీపీఎం

కొత్త ధరల వివరాలు.. (రూపాయల్లో)

| | ₹ |
|---|---|
| 2 కి.మీ వరకు | 12 |
| 2-4 కి.మీ లోపు | 18 |
| 4-6 కి.మీ లోపు | 30 |
| 6-9 కి.మీ లోపు | 40 |
| 9-12 కి.మీ లోపు | 50 |
| 12-15 కి.మీ లోపు | 55 |
| 15-18 కి. మీ లోపు | 60 |
| 18-21 కి.మీ లోపు | 66 |
| 21-24 కి.మీ లోపు | 70 |
| 24 కి.మీ పైన | 75 |

సిటీబ్యూరో, మే 15 (నమస్తే తెలంగాణ):

మెట్రో ప్రయాణికులకు హెచ్ఎంఆర్ షాకిచ్చింది. అనుకున్నట్లుగానే టికెట్ రేట్లను పెంచింది. శనివారం నుంచి కొత్త చార్జీలు అమల్లోకి వస్తాయని వెల్లడించింది. అప్పులను సాకుగా చూపుతూ... ఆర్థికంగా నిలబడేందుకే టికెట్ ధరలు పెంచాల్సి వస్తున్నదన్న వివరణ ఇచ్చింది. కనిష్ఠంగా ప్రస్తుతం రూ. 10 ఉన్న టికెట్ ధర రూ.12 అవుతుండగా, గరిష్ఠం రూ. 60 నుంచి రూ. 75కి చేరనున్నది. ఈ లెక్కన సగటున ప్రతి టికెట్‌పై 20 శాతం ధరలను పెంచుతున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. పెరిగిన ధరల ప్రకారం ఎల్బీనగర్ నుంచి విక్టోరియా మెమోరియల్ ప్రస్తుతం రూ. 10 ఉంటే పెరిగిన ధరతో రూ. 12. అమీర్‌పేట నుంచి ఎల్బీనగర్ వెళ్లేందుకు రూ. 45 ఉండగా, తాజాగా రూ. 50 కానున్నది. కొత్త చార్జీలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి.

### చార్జీల పెంపుపై చర్చ..

చార్జీలు పెంచాలని ఫేర్ ఫిక్సేషన్ కమిటీ 2023 జనవరి 25న అప్పటి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అయితే టికెట్ ధరలను పెంచే ఉద్దేశమే లేదని కాంగ్రెస్ సర్కారు చెబుతూనే.. ఆ పాత నివేదిక ఆధారంగానే రేట్లను పెంచుతున్నట్లు ప్రకటించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. మెట్రో ధరల పెరుగుదలపై ప్రయాణికులు తీవ్రంగా స్పందిస్తుండగా... స్టేషన్ పరిసరాల్లో ఉచిత టాయిలెట్లు, పరిశుభ్రత పాటించాలంటూ వ్యాఖ్యానిస్తున్నారు. మెట్రో టికెట్ ధరలను పెంచడంపై సీపీఎం పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. 'సామాన్యుడికి మెట్రో ప్రయాణం మరింత భారం కానున్నది. ఎల్ అండ్ టీ సంస్థకు వచ్చే నష్టాలకు, ఆ సంస్థ నిర్వాహణ వైఫల్యమే, 50శాతం రియల్ ఎస్టేట్ ద్వారా రావాల్సిన ఆదాయాన్ని సర్దుబాటు చేసుకోకపోవడంతోనే ఇప్పుడు టికెట్ల ధరలకు కారణమైంది'.. అని ఆ పార్టీ మండిపడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదం లేకుండా చార్జీలను ఎలా పెంచారంటూ, ఈ అంశంలో రాష్ట్ర సర్కారు పునరాలోచన చేసి సామాన్యుడిపై భారం పడకుండా చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ సీపీఎం కార్యదర్శి వెంకటేశ్ పేర్కొన్నారు.



## కంచ పునరుద్ధరణ శాస్త్రీయంగా ఉండాలి

### గచ్చిబౌలి భూముల్లో ఎంపిక చేసిన మొక్కలే నాటాలి

హెచ్‌సీయూ విద్యార్థుల డిమాండ్

సిటీ బ్యూరో, మే 15 (నమస్తే తెలంగాణ): కంచ గచ్చిబౌలి పరిధిలోని హెచ్‌సీయూ భూముల్లో కాంగ్రెస్ సర్కారు చెట్లను నరికేసిన ప్రాంతంలో పుపరుద్ధరణ పనులు చేపట్టాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. సుప్రీం ఆదేశాలను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు స్వాగతించారు. ప్రభుత్వం చేపట్టే పునరుద్ధరణ పనుల్లో యూనివర్సిటీ ప్లాంట్ సైన్స్ ప్రొఫెసర్లు, విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని కోరారు. ఎకాలజిస్టులు, ప్లాంట్ సైన్స్ ప్రొఫెసర్లను సంప్రదించి వారు సూచించిన మొక్కలనే నాటాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చదును చేసిన 100 ఎకరాల్లో అటవీ మొక్కలే ఉండేవని పునరుద్ధరణలో భాగంగా కూడా అలాంటి మొక్కలనే నాటాలన్నారు. మొక్కలను నాటే క్రమంలో శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలని చెప్పారు. కంచ గచ్చిబౌలి అడవిలో ఉండే జీవ జాతుల మనుగడకు అనువైన మొక్కలను ఎంపిక చేసి నాటాలని సూచించారు. ప్లాంట్ సైన్స్ డిపార్ట్‌మెంట్ గతంలో చేసిన సర్వే ప్రకారం ఆ భూముల్లో 80 శాతం అటవీ మొక్కలే ఉన్నాయని అన్నారు. తిరిగి అవే మొక్కలను నాటడం వల్ల పర్యావరణానికి ప్రమాదం

మిగతా IVవ పేజీలో

# సర్కారు హైడ్రామా!



## సీఎం చెప్పేదొకటి.. చేసేదొకటి

ప్రభుత్వ పెద్దల మాటలకు అర్థాలే వేరులే.. అన్నట్లు.. ఏడాదిన్నరగా చెరువులు..ప్రభుత్వ భూముల పరిరక్షణ అనే రేవంత్ సర్కారు సంకల్పానికి.. సామాన్యుడే సమిధిగా మారుతున్నాడు. నిరుపేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని తలదాచుకుంటే స్కెచ్ వేసి.. అర్ధరాత్రి లేదా తెల్లవారుజామున విరుచుకుపడే అధికార యంత్రాంగం.. బడాబాబుల విషయానికి వచ్చే సరికి 'హైడ్రా'మాలాడుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి గ్రేటర్ పరిధిలో ఎక్కడ సమావేశాల్లో ప్రసంగించినా.. సర్కారు భూముల్ని ఆక్రమిస్తే, వాళ్లు ఎంతటి వారైనా ఉపేక్షించమని హెచ్చరికలు చేయడం ఆనవాయితీగా మారింది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటున్నది. చెప్పేదొకటి.. చేసేది మరొకటిలా.. చెరువులను పరిరక్షిస్తామంటూ.. హైడ్రాతో హల్‌చల్ చేస్తూనే.. పెద్దోళ్ల కోసం సర్కారు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను క్రమబద్ధీకరణకు కసరత్తు చేస్తుండటం కొసమెరుపు.

-హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 15 (నమస్తే తెలంగాణ):



రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 84/పీలో ఉన్న 8.15 ఎకరాల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోని భూముల్ని నివాసయోగ్య భూములుగా మార్చేందుకు అభ్యంతరాలు కోరుతూ హెచ్ఎండీఏ ఈ ఏడాది జనవరి 10న నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో గోపి చెరువు ఉంది. నిక్షేపంగా ఉన్న చెరువులో ఆకాశహర్మ్యాలు నిర్మించేందుకు బడా కంపెనీ ఒకటి ప్రణాళిక రూపొందిస్తే..అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూ వినియోగాన్ని మార్చేందుకు రంగం సిద్ధం చేసింది.

### మాటల కోటలు.. సామాన్యుడికే వాతలు!

చెరువులను పరిరక్షిస్తామంటూ హైడ్రాతో హల్‌చల్

మరోవైపు బడాబాబుల కోసం ఎఫ్‌టీఎల్, బఫర్ క్రమబద్ధీకరణ

సర్కారు భూములు కాపాడతామంటూ ప్రసంగాల్లో కోతలు

బంజారాహిల్స్, కొత్వాల్‌గూడల్లో హైడ్రామా!

తెర వెనక పెద్దలు తిప్పుతున్న చక్రంతో రెవెన్యూ శాఖ విలవిల

**సంగారెడ్డి జిల్లా** హత్నూర మండలం బోరపట్ల గ్రామ పరిధిలోని 381/పీ సర్వే నంబరులో దాదాపు ఐదెకరాలకు పైగా భూమిని నివాస (రెసిడెన్షియల్) జోన్‌లోకి మార్చేందుకు ఇదే ఏడాది ఫిబ్రవరి 27న హెచ్ఎండీఏ మరో నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో దాదాపు 700 చదరపు గజాలకు పైగా స్థలం బఫర్‌జోన్‌లో ఉంది. అంటే చెరువు పరిధిలో ఉందన్న మాట. పనిలో పనిగా ఈ స్థలాన్ని కూడా నిర్మాణాలు కట్టేందుకు అనువుగా మార్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇక్కడా బడా బాబులే దరఖాస్తు చేసుకున్నారు.

**మేడ్చల్ జిల్లాలోని** గుండ్లపోచంపల్లి మండలం మైసమ్మగూడ గ్రామ పరిధిలో ఉన్న 517/పీ, 518/పీ సర్వే నంబర్‌లోని సుమారు రెండు ఎకరాల భూమిని కూడా నివాస జోన్‌లోకి మార్చేందుకు ఈ ఏడాది జనవరి 10న హెచ్ఎండీఏ నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందులో అత్యధిక భాగం బఫర్‌జోన్‌లో ఉందని అధికారులు చెబుతున్నారు. అంటే చెరువులోని భాగమన్న మాట. ఈ రెండెకరాల్లో ఆకాశహర్మ్యాలు నిర్మించేందుకు అడ్డుగా ఈ బఫర్‌జోన్ ఉండటంతో దానిని కూడా నివాస జోన్‌లోకి మార్చేందుకు దరఖాస్తు చేసుకుంటే అధికార యంత్రాంగం మార్గం సుగమం చేసే పనిలో ఉంది.

**చెరువులను** చెరబడితే చెరసాలనే... అన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెరువుల పట్ల అవలంబిస్తున్న తీరుకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఎవరో బడా బాబులు, కార్పొరేట్ సంస్థలు గతంలో చెరువుల్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను సామాన్యుడు కొనుగోలు చేస్తే హైడ్రా పేరుతో వాటిని కూల్చివేశారు. మరి... ప్రభుత్వమే చెరువులను కనుమరుగు చేసేలా ఇలా నోటిఫికేషన్లు జారీ చేసి.. నీటి వనరుల స్థానంలో కాంక్రీట్ జంగిల్‌ను తయారు చేస్తే ఎవరిని అడగాలి? సామాన్యుడిపై బుల్డోజర్లను పంపిన ఈ సర్కారు.. బడా బాబుల దరఖాస్తులకు మాత్రం ఎర తివాచీ పరచడాన్ని ఏమనాలి??

### ప్రభుత్వ భూముల్లో బడా బాబులు వేస్తున్న పాగా, అందుకు అధికార యంత్రాంగమే సహకరిస్తున్న తీరుపై మచ్చుకు రెండు ఉదాహరణలు ఇవిగో..

**బంజారాహిల్స్‌లో** ఉన్న సుమారు రూ.300 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం.. షేక్‌పేట మండల పరిధిలోని సర్వే నంబర్ 403/పీ లోకి వచ్చే టీఎస్ నంబర్ 111, బ్లాక్- హెచ్, వార్డు-10లో ఎకరంన్నర భూమిని జలమండలికి కేటాయించగా.. అందులో ఒక రిజర్వాయర్ నిర్మించారు. దానిని ఆనుకొని మరో 3.20 ఎకరాల ఖాళీ స్థలం ఉంది. రెవెన్యూ శాఖ ఆధీనంలో ఉంది. ఈ ఖాళీ స్థలంపై ఒక ప్రైవేటు వ్యక్తి కన్నుపడింది. ఆర్నెల్లుగా అందులో తిష్ట వేయడం.. 'నమస్తే' కథనం ప్రచురించగానే అధికారులు అతడిని ఖాళీ చేయించడం పరిపాటిగా మారింది. ప్రభుత్వ బోర్డును తరచూ అతను తొలగించి ఇది తనదేనంటూ అమ్మకానికి పెడతారు. ఆ తంతు ముగియగానే అధికారులు మళ్లీ మరో బోర్డును ఏర్పాటు చేస్తారు. ఐదారు నెలలుగా ఇదో పిల్లలాటగా తయారైంది. సామాన్యుడు గజం భూమి ఆక్రమిస్తే బుల్డోజర్లు, పోలీసులతో హంగామా సృష్టించడమనేది గత ఏడాదిన్నరగా నిత్యకృత్యమైంది. కానీ ఇక్కడ ఆర్నెల్లుగా ప్రభుత్వ స్థలంలో ప్రైవేటు వ్యక్తి బోర్డులు తొలగించినా, తానే సొంతంగా సీసీ కెమెరా ఏర్పాటు చేసినా, కుక్కలతో పహారా పెట్టినా అడిగే అధికారి లేరు. తెర వెనక పెద్దల హస్తం లేనిదే అతడు ఇంత దర్జా ఒలకబోస్తాడా.




**రూ.250 కోట్ల** విలువైన మరో సర్కారు భూమి కథ. హిమాయత్‌సాగర్ బఫర్‌జోన్‌ను కలుపుకొని 52 ఎకరాల్లో విస్తరించి ఉంది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ గ్రామంలోని సర్వే నంబర్ 54లో 270.17 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ప్రభుత్వ, ప్రజా అవసరాలకుపోను 52 ఎకరాల భూమి మిగిలింది. దానిని కొందరు బడా బాబులు తమవేనంటూ స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఈ వివాదం నలిగి... చివరకు 2018లో రంగారెడ్డి జిల్లా కోర్టులో 20 వరకు దావాలు పడ్డాయి. కేసీఆర్ ప్రభుత్వం సమర్థవంతంగా వాదించడంతో ఎట్టకేలకు కోర్టు గతేడాది డిసెంబరులో 52 ఎకరాలు ప్రభుత్వ భూమి అని తేల్చింది. ఉత్తర్వులు రెవెన్యూ అధికారులకు చేరాయి. కానీ ఇప్పటిదాకా భూమి సర్కారు ఆధీనంలోకి రాలేదు. ఇదే విషయాన్ని ఎత్తిచూపుతూ 'నమస్తే తెలంగాణ' కథనాన్ని ఇచ్చింది. తెర వెనక పెద్దల ఒత్తిడితో ప్రభుత్వ అధికారులే సదరు ప్రైవేటు వ్యక్తులకు స్టే తెచ్చుకోవాలనే సలహా ఇచ్చి... అందుకు సమయం కూడా ఇస్తున్నారని పేర్కొన్నది. కేవలం ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేసి... అదిగో..స్వాధీనం చేసుంటామంటూ ఐదు నెలలు నెట్టుకొచ్చిన అధికారులు.. సదరు ప్రైవేటు వ్యక్తులు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు కదా! అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. అంటే ఇక ప్రభుత్వ భూమి ప్రైవేటు చేతుల్లోనే ఉంటుందని పరోక్షంగా తేల్చి చెప్పారు.







## అడ్మిషన్ల దందా!

### అనుమతులు లేకుండానే స్కూళ్ల నిర్వహణ

విద్యాశాఖ అధికారుల అలసత్వం

గ్రేటర్ స్కూళ్లల్లో అడ్మిషన్ల దందా యథేచ్ఛగా కొనసాగుతున్నది. విద్యను వ్యాపారంగా మలిచి.. తల్లిదండ్రులను పీల్చిపిప్పిజేస్తున్న పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడం లేదు. కొన్ని పాఠశాలలకు ఎటువంటి అనుమతులు లేకున్నా.. ఇంటర్నేషనల్ బోర్డులు తగిలించి.. కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నారు. భవనానికి కూడా పర్మిషన్ లేకున్నా.. ఇష్టానుసారంగా పాఠశాల నిర్వహిస్తూ అడ్మిషన్లు కొనసాగిస్తున్నారు.

-సిటీబ్యూరో/కొండాపూర్, మే 15 ( నమస్తే తెలంగాణ )

**ఇటీవల** హైదరాబాద్ విద్యాశాఖ అధికారులు లంగర్ హౌజ్‌లోని 800 మంది విద్యార్థులు చదువుతున్న ఆర్చిడ్స్ స్కూల్‌కు అనుమతి లేదని రద్దు చేసిన విషయం తెలిసిందే. ఏడాది వరకు కొనసాగినా.. అధికారులకు కనిపించని స్కూల్ చివర్లో మాత్రం రద్దు చేయడంపై విమర్శలొచ్చాయి. విద్యార్థులు సైతం చివర్లో వేరే స్కూల్లో ప్రవేశానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా చందానగర్‌లోని రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ కూడా నిబంధనలకు పాతరేసి అడ్మిషన్ల దందా చేస్తున్నది. భవనానికి గాని.. స్కూల్‌కు ఎటువంటి అనుమతులు లేకున్నా పాఠశాల నిర్వహిస్తుండటం విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. ఈ తరహాలోనే గ్రేటర్‌లో చాలా పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయంటూ

మిగతా IVవ పేజీలో

## నకిలీ వీసాల ముఠా గుట్టురట్టు



శంషాబాద్ రూరల్, మే 15 : నకిలీ వీసాలు తయారు చేసి.. కువైట్‌కు పంపిస్తున్న ముఠా పట్టుబడింది. గురువారం శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. నకిలీ వీసాలతో ఎనిమిది మంది మహిళలు కువైట్ వెళ్లేందుకు ఎయిర్‌పోర్టుకు రాగా, అనుమానం వచ్చి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో చిలుకూరి బాలాజీ, శివకుమార్ అనే ఏజెంట్లు వీరికి నకిలీ వీసాలు ఇచ్చినట్లు తేలింది. అవుట్ పోస్టు..ఎస్‌వోటీ పోలీసులు వారిద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన రామంజనేయులు, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన చిలుకూరి బాలాజీ, అన్నమయ్య జిల్లా చెందిన శివకుమార్, కడప జిల్లాకు చెందిన గోపాల్ ముఠా సభ్యులుగా ఏర్పడినట్లు గుర్తించారు. పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన చదువురాని వారితో పాటు పేద వర్గాలకు చెందిన వారిని గుర్తింపు గల్ఫ్ దేశాలకు వెళితే అధిక డబ్బులు వస్తాయని ఆశచూపుతున్నారు. నకిలీ వీసాలు తయారు చేయడంతో పాటు వారి వద్ద నుంచి డబ్బులు తీసుకొని మోసం చేస్తున్నట్లు తేలింది. చిలుకూరు బాలాజీ, సంకర శివకుమార్‌ను రిమాండ్‌కు తరలించగా, మిగతా వారిని కోసం గాలిస్తున్నారు. నిందితుల నుంచి ట్యాంపర్డ్ పాస్‌పోర్టులు 14, గల్ఫ్‌దేశాల వీసాలు 14, శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి మస్కట్ వెళ్లే టికెట్లు వంటివి స్వాధీనం చేసుకున్నారు.

## ముంపు ముప్పు లేకుండా..

మల్కాజిగిరి: వరద ముంపు నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం అల్వాల్ డివిజన్‌లోని చిన్న రాయిని చెరువు దాని పరిసరాలను బల్దియా అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. వెంకటాపురం డివిజన్ ఖానాజిగూడలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబితా కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

